# చేసిన పని!

రచన :
"గగనమూర్తి"

బొట్టు తలమీద చెయ్యి పెట్టుకొని తీవ్రంగా ఆలోచిస్తూన్న శరభయ్య, ధుమధుమ లాడుతూ గదిలో ప్రవేశించిన రుక్కమ్మను చూడగానే ఇంట్లో తుపాను రేగిందన్న సంగతి గ్రహించాడు.

ఆఫీసు గదిలో ప్రవేశించగానే రుక్కమ్మ రుసరుస లాడుతూ శాసించింది.

"శంకరాన్ని నేనే యింటిలోనుంచి పొమ్మన్నాను. వాడికిగాని రాజ్యాన్ని ఇచ్చి పెళ్ళి చేయడానికి తలపెట్టేరా అంటే నూతిలో పడి ముందు నేను చస్తాను. ఆపైని మీరూ, వాడూ ఎలా పిలకలు ముడిపెట్టుకొన్నా నాకు అవసరం లేదు."

రుక్కమ్మ అలా ప్రతిజ్ఞచేయడం యిది తొంభయ్యోసారి. రుక్కమ్మభయంకర ప్రతిజ్ఞలకు అలవాటుపడ్డా శరభయ్యలో యీ శాసనమాత్రం చలనాన్ని కలిగించింది.

"సరే అయిందేదో అయింది. నేనుమాత్రం నీ మాటకు యెప్పుడేనా అడ్డుచెప్పే నా రుక్కూ! మీ చెల్లెలి కొడుక్కి రాజ్యాన్ని యిచ్చి పెళ్ళి చెద్దామండీ అని నువ్వు అంటేనే కదూ వాణ్ణి తీసుకొచ్చి యింటిలో పెట్టుకొన్నదీ? నువ్వు కాదంటే నేను అవుననంటానా?" అని 'యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెంటు' తత్వాన్ని మాటల్లోనింపి సముదాయించేడు శరభయ్య.

"వాడు యింతటివాడు, అంతటివాడు అని మీరనగానే అవును కామోసు అనుకొని రాజ్యాన్ని యిచ్చి పెళ్ళి చేద్దామన్నాను కాని యిలాంటి కోతి వెధవ అని తెలిస్తే నేను సుతరామూ అంగీకరించే దాన్ని కాను. ఇవాళ సాయంత్రం రాజ్యం తన గదిలోకూర్చొని కుట్టుపని చేసుకొంటూఉంటే గబగబా ఆ గదిలోకి వెళ్ళి తలుపు బిడాయించేడు. ఏమిటి చేస్తాడో చూద్దామన్న దుగ్ధ కొద్దీ—మనస్సు ఉండబట్టక — కన్నంలోంచి నేను తొంగిచూసిన మాట వాస్తవం. అయితే అలాటి పనులు చేస్తాడనీ, మాటలు అంటాడనీ అనుకొన్నానా? అప్పుడేం చేసేడనుకొన్నారు?"

ఏమిటి చేశాడన్నట్టు ప్రశ్నార్థకంగా చూసేడు శరభయ్య.

"రాజ్యం కాళ్ళదగ్గర కూర్చొని ఉన్న జానీని రబ్బరు బంతిలా తన్నేడు. అది కుయ్యో, మొర్రో అంటూంటే దానిని తీసుకొచ్చి, మీరు అన్నారు కదా అని యెంతో ఆప్యాయంగా తయారుచేసి రాజ్యంకోసం టేబిలుమీద పెట్టిన జిలేబీలు దాని చేత తినిపించేడు. ఆపనికి నే నేమైనా అన్నానా? తరవాత—మీరు నమ్ముతారో లేదో—మీరు పండుక్కికొన్న సిల్కుచీర పట్టుకొని కోరి తీయించుకొన్న ఫొటో తీసికొని మెడలో తగిలించాడు" అంది రుక్కమ్మ రుద్ధకంఠంతో.

శరీరంమీద తేళ్ళూ, జెర్రిలూ ప్రాకినంతయింది శరభయ్యకి.

"అయితే వాణ్ణి యింట్లోంచి పొమ్మనడం చాలా మంచి పనిచేశావు రుక్కూ!" అని అభినందించాడు శరభయ్య అంతటితో తన బాధ్యత తీరిపోయినట్టు.

"ఆమాట వాడి చేష్టలన్నీ విన్నాక అనండి. ఇన్నీ అన్నీనా వాడి అగడాలు. అప్పటికీ సహించాను. అప్పుడేం చేసాడనుకొన్నారు? కుర్చీమీద కూర్చున్న రాజ్యాన్ని అమాంతం కౌగలించుకొని ముద్దులతో, పెద్దపులి లేడిపిల్లను నలిపినట్టు నలిపేశాడు. అందుకు అమ్మాయి వాణ్ణి వద్దని వారించిందంటారా? ఊఁహు...దానికి లేనిబాధ నాకెందుకని నేనూ ఊరుకొన్నాను."

"వాళ్ళిద్దరూ దెబ్బ లాడుకొన్నారేమో అనుకొన్నాను నేను" అని సందేహం వెలి బుచ్చాడు శరభయ్య.

"వాళ్ళు దెబ్బ లాడుకొంటే మాత్రం నేను వద్దంటానా? అప్పటికీ సహించాను. అంతటితో ఊరుకొన్నాడా? ఎక్కడో తనకి పెద్ద జీతంమీద బ్యాంకులో ఉద్యోగం వచ్చిందనీ—తనని పెళ్ళాడితే వెంటనే మకాం ఎత్తేసి, చల్ మోహనరంగా అంటూ కాలక్షేపం చెయ్యొచ్చు అనీ మంత్రోపదేశం చేశాడు. అందుకు అమ్మాయి ఏమిటందనుకొన్నారూ? హాయ్యో! రాత—ఆడపిల్లకి చదువెందుకండీ? అంటే నామాట విన్నారూ?"

తప్పు ఒప్పుకొన్న నేరస్తుడిలా మొహం పెట్టి "ఏమిటంది అమ్మాయి?" అని యడిగాడు భయంతో, శరభయ్య.

రుక్కమ్మ తీక్షణంగా చూస్తూ "అందుకు ఒప్పేసుకొంది" అని అమ్మాయి అపరాధాన్ని వెల్లడించింది. 'అంతేకద' అనుకొని శరభయ్య దీర్ఘ నిశ్వాసం వదిలాడు.

"అంతటితో ఊరుకొన్నాడా? వాడి పోగాలం బొగ్గులవ! నేనొక చెడ్డ కలనట! గులాబిపువ్వు నంటిపెట్టుకొన్న ముల్లునట! ప్రణయ మధుపాత్రలో విషపు చినుకునట...అంటూ ఏదో కవిత్వం వెలిగించాడు చూసేరా? వాడి దారుణం..."

నుదుటిమీద చెమట తుడుచుకొని, తడి ఆరిపోయిన పెదవులను తడిచేసుకొంటూ రెండు గుటకలు మ్రింగాడు శరభయ్య.

"వాడు అన్నమాటలన్నీ సహించాను. రాజ్యం చేత సిగరెట్టు కాలిపించేడు. దానికిలేని బాధ నాకెందుకని ఊరుకొన్నానా?"

"నీకు సహనం ఎక్కువ రుక్కూ! నువ్వే నిజమైన స్త్రీవి!" అని అభిప్రాయాన్ని వెల్లడిచేసాడు శరభయ్య.

"అప్పుడేం చేసాడనుకొన్నారు? కుర్చీమీద నుంచి లేస్తూ మీరు తెచ్చి అతి జాగ్రత్తగా టేబిలు క్రింద దాచిన వార్నీసు డొక్కును కాలితో తన్నేసాడు. క్రింద పడిఉన్న జంబుఖానా అంతా తగలడింది వాడి బూట్లనిండా వార్నీసు పడింది. అందుకు నేనేమైనా కోపగించుకొన్నానా?" అంది రుక్కమ్మ తాను ఎంతో శాంతమూర్తిని అని తెలియజేస్తూ.

"ఇంతకూ వాడు చేసినపని..."

"ఏమిటది?" అని అడిగాడు బాంబు ప్రేలడానికి సమయమెందని నిర్ధారణచేసిన శరభయ్య.

రుక్కమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ అంది.

"ఏంచేసాడో చూసేరా? మీరు నమ్మతారో, లేదో—బూట్లమీద పడిన వార్నీసును, పండుక్కి మీరెంతో ప్రేమతో తెచ్చియిచ్చిన సిల్కు చీర పైకి తీసి...హాయ్యో!...దానితో బూట్లను తుడిచేసాడు!"




ఆరోగ్యజీవనము

మీ అందుబాటులోనే వుంది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము

అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యముగ వుండనియెడల మొత్తము గృహమే అనారోగ్యమై అనాకర్షవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితులందైనను కాపాడుకోవాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది. "లోధ్ర" స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయ రోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.

తెలుగుజిల్లాలకు, వైజాముకు ఏజెంట్లు:
సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.